# నాన్నా పెళ్ళి!

1988 వినాయకచవితి కాలం దాటని కథల పోటీలో రు. 75/- లు గెల్చుకున్న కథ.




పెళ్ళి చూపులు ముగిశాయి. అంగరూ వెళ్లిపోయారు. యుద్ధం ముగిసిపోయినట్లుగా, ప్రశాంతంగా వుంది. చేతులు కడిగేసిన ప్లేట్లు నేల కొరిగిన సైనికుల్లా వున్నాయి! యుద్ధంతో సర్వం కోల్పోయిన రాజులా పరంధామయ్య వాలుకుర్చీలో మేను వాల్చాడు. అలికిడి కాగా వెను దిరిగి చూశాడు పరంధామయ్య.

శాంత! భయంభయంగా కనురెప్ప లార్పుతూ, నేల చూపులు చూస్తూ ప్రశ్నించింది శాంత.

"నాన్నా! నేను వారికి నచ్చానా?"—

"ఆ నచ్చావమ్మా... కాని"

"ఆ కాని!" అని ఏనాడు రెట్టించి అడగలేదు శాంత. బాణం దెబ్బతిన్న పావురంలా మెల్లిగా లోనికెల్లింది. బాధగా నిట్టూర్చాడు పరంధామయ్య.

కాలం పరిగెడుతూనే వుంది. వయసుతో పాటు, శాంత పెళ్లి మరింత భారమయిపోతోంది పరంధామయ్యకు. అలా పది వసంతాలు గడిచినా శాంతపాదాలు పారాణిభాగ్యానికి నోచుకోలేదు.

** ** **

.శాంత పెళ్లి విషయమై కాళ్లరిగేలా తిరిగి వసారాలో అడుగుపెట్టిన పరంధామయ్య ఒకింత ఆశ్చర్య పోయాడు. అగరొత్తుల ధూమం గాలిలో తేలివస్తోంది. సంపెంగలు గుబాళిస్తున్నాయి. తను మామూలుగా విశ్రమించే వాలుకుర్చీ కొత్త రంగులతో డాబుగా వుంది. పరంధామయ్యకేమీ అంతుపట్టలేదు. "శాంతా... శాంతా" ఆదుర్దాగా పిలిచాడు. వంట గదిలోనుండి శాంత బయట కొచ్చింది. కొత్త గుడ్డల్లో నవవధువులా వుంది శాంత. అంత అందమైన కూతురున్నందుకు ఓ క్షణం ఆయన గుండె ఆనందంతో నిండిపోయింది. తండ్రి వైపు బేలగా చూసింది శాంత. "ఇంకెప్పుడు నా పెళ్లి చేస్తావ్?" అన్నట్లుగా వున్నాయా చూపులు. గుండెల్లో శూలం దింపినట్లుగా బాధపడి పోయాడు పరంధామయ్య. "నాన్నా!" భయం భయంగా పిలించింది శాంత.

'ఏం తల్లీ' ఆప్యాయత నిండిన గొంతుతో ప్రశ్నించాడు పరంధామయ్య. "నేను... మరే... మరే..." నేల చూపులు చూస్తూ నును సిగ్గులు పోతోంది శాంత. "ఆ! చెప్పమ్మా" లాలనగా అన్నాడాయన.

"పె...ళ్లి... చేసుకున్నాను!!" నెత్తిన పిడుగు పడ్డట్లు చలించిపోయాడు పరంధామయ్య.

"ఇదో... వరుడు..." చిట్టి దండ వేసివున్న ఓ చెక్క బొమ్మను చూపింది శాంత.

భలే... భలే" చప్పట్లు చరిచింది శాంత. పరంధామయ్యకు పిచ్చిపట్టేట్లుగా వుంది. చిన్న పిల్లలా ఎగురుతూ తన చుట్టూ తిరుగుతున్న శాంతను చూసే సరికి ఆయన మొహం రక్తం లేనట్లుగా పాలిపోయింది. ఎగురుతూ తిరగడం చటుక్కున ఆపింది శాంత. "నవ్వవూ నాన్నా నవ్వవూ... నవ్వు" కితకితలు పెట్టసాగింది. నవ్వడం మరచిన పరంధామయ్య పెద్దపెట్టున నవ్వుకున్నాడు. శాంత మరింత గట్టిగా నవ్వుతూ కేరింతలు కొడుతోంది.

సమాజం కూడా... వారిద్దరినీ చూసి మరింత వికృతంగా నవ్వుతోంది!

—తమ్మినేని యదుకులభూషణ్